క్లుప్తంగా

'గోపా' సేవలు విస్తరించాలి



మాట్లాడుతున్న నాయకులు

సంగారెడ్డి టౌన్: గౌడులందరూ ఏకం కావడానికి గోపా ఒకటే మార్గమని అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ అన్నారు. గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ గోపాల సభ్యులుగా చేరి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రాజుగౌడ్, వీరయ్యగౌడ్, లింగాగౌడ్, విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ అధ్యక్షుడిగా సాయిబాబా



సాయిబాబాను సన్మానించిన సంఘం బాధ్యులు

నారాయణఖేడ్: వాసవీ క్లబ్ నారాయణఖేడ్ శాఖ అధ్యక్షుడిగా కోటగిరి సాయిబాబాను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సాయిబాబాను ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్, అవోపా సంఘాల బాధ్యులు అభినందించారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా జనార్దన్



కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న విజయరావు

జహీరాబాద్ టౌన్: తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జహీరాబాద్ అధ్యక్షుడిగా గడ్డం జనార్దన్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. పట్టణంలోని పద్మశాలి భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పటేల్ రాజేందర్‌రావు, ఉపాధ్యక్షుడిగా ఎండీ. అజీం, విజయలక్ష్మి, అసోసియేట్ అధ్యక్షుడిగా కొలాస్ ప్రభాకర్, కోశాధికారిగా చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీగా నర్సింలు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొలాస్ రాజశేఖర్, సభ్యులుగా చంద్రశేఖర్, యాకూబ్, సైఫోద్దీన్ ఘోరీ, బాగారెడ్డి, రాందాస్, రమేష్ బాబు, దుర్గయ్య, మల్లేశం ఎన్నికైయ్యారు. ఎన్నికల అధికారిగా విజయరావు, జగదీశ్వర్లు వ్యవహరించారు.

కేంద్ర పథకాలను వివరించండి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పట్టణ పరిధిలోని బీజేపీ అధ్యక్షుడు ఐలేష్ ఆధ్వర్యంలో ఆదివారం సేవా పక్షం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ నాయకులు నర్సింగ్ రావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలు ప్రజలతో స్నేహభావంతో మెలగాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు రవీందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు

కల్హేర్(నారాయణఖేడ్): అర్హులందరికీ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తోందని మాజీ ఆత్మకమిటీ చైర్మన్ గుండు నరేందర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బండారి సాయిలు తెలిపారు. ఆదివారం మండలంలోని బీబీపేట్‌లో లబ్ధిదారులకు కొత్తగా రేషన్‌కార్డులు అందజేశారు. సింగిల్ ఫేజ్ బోరు ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాబుమియ, భూమయ్య, బాలయ్య, భాస్కర్ ఉశయ్య పాల్గొన్నారు.

సేవకు బయలుదేరిన భక్తులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌కు చెందిన సప్తగిరి సేవా సమితి సభ్యులు శ్రీశైలం మల్లన్న చెంత మానవ సేవ చేయడానికి ఆదివారం బయలుదేరి వెళ్లారు. 16 మంది మహిళా సభ్యులు వారం రోజుల పాటు శ్రీశైలంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. సేవలో పాల్గొనే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు సభ్యులు పేర్కొన్నారు.

నిఘా నేత్రం.. రక్షణ కవచం



పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కీలకంగా మారుతున్న కమాండ్ కంట్రోల్ సెంటర్

- 500 సీసీ కెమెరాలు ఏర్పాటు
- నేరాల నియంత్రణపై ప్రత్యేక నిఘా

సంగారెడ్డి క్రైమ్: జిల్లా హెడ్‌క్వార్టర్ జనాభా రోజు రోజుకు పెరుగుతుంది. రాష్ట్రంలో హైదరాబాద్ జిల్లా తర్వాత అభివృద్ధిలో సంగారెడ్డి ప్రథమంగా దూసుకెళ్తోంది. ఆధునిక సాంకేతిక వినియోగంలోనూ ముందంజలో ఉంది. అభివృద్ధితో పాటు హెడ్‌క్వార్టర్‌లో నేరాలు, దొంగతనాలు సైతం పెరుగుతున్నాయి. సంగారెడ్డి మున్సిపాలిటీలో రెండు లక్షల పైగా జనాభా ఉన్నారు. మున్సిపాలిటీలోని 38 వార్డుల్లో ప్రతిరోజు దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, నేరాలు, హత్యలు జరుగుతుండటంతో వాటిని అరికట్టడానికి పట్టణ వ్యాప్తంగా 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్

పట్టణ భద్రత కోసం స్మార్ట్ సిటీ పథకం ద్వారా సుమారు రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) సత్ఫలితాలనిస్తోంది. కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పోలీసుల ప్రత్యేక దృష్టి పెట్టారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీసు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో సీసీ కెమెరాల ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జిల్లా కేంద్రం సీసీ కెమెరాలు నిఘాలో ఉంది. పట్టణంలోని కాలనీలు, ప్రధాన రహదారి వెంట జరిగే రోడ్డు ప్రమాదాలపై తక్షణమే సీసీ కెమెరాలు పరిశీలించి వెంటనే వారిపై చర్యలు తీసుకుంటున్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు పోలీస్ శాఖ ఏర్పాటు చేసింది. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

ఒక్క సీసీ కెమెరా 100 మందితో సమానం



ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం. త్వరలో ఎస్పీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నాం. పట్టణంలోని యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. దాతలు ముందుకు వచ్చి వాటిని కీలకమైన చోట్ల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. - రమేష్ పట్టణ సీఐ

ప్రజల భద్రత ..

ఐసీసీసీ పట్టణ ప్రజల భద్రతకు చాలా ఉపయోగపడుతోంది. జిల్లాలో అసాంఘిక ఘటనలు, ఉత్సవాలు, రాజకీయ సభలు, దొంగతనాలు ఇతర పరిస్థితుల్లో ఐసీసీసీ సేవలను పోలీస్‌శాఖ వినియోగిస్తున్నారు.

500 సీసీ కెమెరాల ఏర్పాటు

జిల్లా హెడ్ క్వార్టర్‌లో పోలీస్‌శాఖ ఇప్పటికే 300 పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మిగతా సీసీ కెమెరాలు ఈ నెల చివరి వరకు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రధాన కూడళ్లలో 100కు పైగా సీసీ కెమెరాలు నిత్యం పనిచేస్తున్నాయి.

సీసీ కెమెరాలతో నేరాలు అదుపు

టీడీఎల్ సీఐ విజయ్ కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

పటాన్‌చెరు టౌన్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రణ చేయొచ్చని టీడీఎల్ సీఐ విజయ్ కృష్ణ అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కర్దనూర్ శివారులోని డబుల్ బెడ్‌రూమ్‌లో నివాసముంటున్న వారితో మేము సైతం కార్యక్రమం నిర్వహించి, సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాలు, దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను సులువుగా గుర్తించవచ్చన్నారు. డబుల్ బెడ్ రూమ్‌ల వద్ద లోపల వైపు, బయట రోడ్డు వైపు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న బీజేపీ నాయకులు

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం మండలంలోని ఖానాపూర్(కె)లో బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. సిర్గాపూర్ మండలం కడ్పల్ మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, రిటైర్డు ఆర్‌ఐ నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడి సంజీవరావు, మాజీ సర్పంచ్‌లు భూంరెడ్డి, సాయగౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు బషీర్, నాయకులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల్లో ట్రాఫిక్ సిగ్నల్

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలోని బైపాస్ నుంచి స్థానిక ఐబీకి వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్‌కు చెట్ల కొమ్మలు అడ్డుగా మారాయి. కొన్ని నెలలుగా చెట్ల కొమ్మల్లోనే ట్రాఫిక్ సిగ్నల్స్ పడుతుండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఐబీ వద్ద వాహనదారులకు ఫిక్ సిగ్నల్స్ సరిగ్గా కనిపించకపోవడంతో పలుమార్లు గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి చెట్ల కొమ్మల్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు వాపోతున్నారు.



ట్రాఫిక్ సిగ్నల్‌కి అడ్డుగా మారిన కొమ్మలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈదులనాగులపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 2014–15 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ప్రవీణ్ కుమార్, సురేష్, సాయి, కవిత, సౌజన్య, హారిక తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని 132/33కేవీ సబ్‌స్టేషన్‌కు ఆదివారం 50ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ చేరుకుంది. ఇక్కడ ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సదాశివపేటకు పంపించి ఈ సబ్ స్టేషన్‌కు 16ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. దీంతో కౌడిపల్లి, కొల్చారం, చిలప్‌చెడ్ మండలాల్లో లోఓల్టేజీ సమస్య నెలకొంది. ఈ విషయపై ఇటీవల ఎమ్మెల్యే సునీతారెడ్డితోపాటు బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన అధికారులు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకొచ్చారని, దీనిని త్వరలో బిగించనున్నట్లు తెలిపారు.



కౌడిపల్లికి చేరుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

నేడు రెవెన్యూ కార్యాలయం ముట్టడి

జహీరాబాద్: పింఛన్లను పెంచాలని కోరుతూ సోమవారం జహీరాబాద్ తహసీల్దార్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు నర్సింగరావు పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రభుత్వం వికలాంగ, వితంతు, వృద్ధులు, ఒంటరి మహిళల పింఛన్లను పెంచే విషయంలో జాప్యం చేస్తున్నందున ఈ ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో పింఛన్‌దారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు రామచందర్, రవికుమార్, జయరాజ్, ఉల్లాస్, రాజేంద్రరాజు, పవన్ పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న వీధి కుక్కలు

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ, దాడులు చేస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. పట్టణంలో వీధి కుక్కలు ఎక్కువ కావడంతో ప్రజలు, విద్యార్థులు బయట తిరగాలంటే భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని రోజులుగా వీధి కుక్కలు తరచుగా మహిళలు చిన్నపిల్లలపై దాడులు చేసి గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి. వెంటనే మున్సిపాలిటి సిబ్బంది స్పందించి కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



వీధిలో సంచరిస్తున్న కుక్కలు

రామకృష్ణకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. విద్యారంగంలో ఆయన చేసిన సేవలకు ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ పురస్కారాన్ని మాజీ శాసనమండలి చైర్మన్ మధుసూదనాచారి, వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ సత్యనారాయణ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో రమేష్,దయాకర్, సాయినాథ్, సత్యనారాయణ, స్వామి, రమేష్ పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న రామకృష్ణ

ఉప కేంద్రం ఏర్పాటు చేయండి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని వెంకటపూర్ కే గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ మార్కెట్ ఉప కేంద్రంను ఏర్పాటు చేయాలని ఆదివారం సొసైటీ చైర్మన్ అందె కొండల్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గతంలో ఉప కేంద్రం ఏర్పాటు చేశారు. కానీ, కొన్ని అనివార్య కారణాల వల్ల తిరిగి ప్రారంభించాలని గ్రామ పెద్దల సమక్షంలో తీర్మానించారు. గ్రామంలో యూరియా కొరత ఏర్పడటంతో గ్రామంలో తప్పనిసరిగా ఉప కేంద్రం ఏర్పాటు చేయాలని కల్వకుంట సొసైటీ చైర్మన్‌కు, డీసీవో మెదక్‌ను కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ధ్వంసం.. ప్రయాణికుల ఇక్కట్లు

జిన్నారం(పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల పట్టణాల పరిధిలో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో రవాణా అస్తవ్యస్తంగా మారి ప్రజలు అవస్థలు పడుతున్నారు. మారుమూల గ్రామాల రోడ్లు సైతం అస్తవ్యస్తంగా మారడంతో ప్రయాణం నరకంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. జిన్నారం పట్టణ పరిధిలోని శివనగర్, గడ్డపోతారం పట్టణ పరిధిలోని మాదారం, గుమ్మడిదల పట్టణ కేంద్రం నుంచి కానుకుంట వరకు రోడ్ల దుస్థితి దారుణంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రోడ్లపై చినుకు పడిందంటే చిత్తడిగా మారుతున్నాయి. దీంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు అనునిత్యం ఈ రోడ్డుగుండా ప్రయాణం సాగించలేక పోతున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి రోడ్డు ధ్వంసమైన పట్టించుకునే నాథుడేలేడని మండిపడుతున్నారు. సమస్యపై సంబంధిత మున్సిపల్ అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రయాణ వెతలు ఎప్పుడు తీరుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ధ్వంసమైన రోడ్లపై ఇప్పటికే ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రత్యేక, మున్సిపల్ అధికారులు రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



గుంతల రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనాలు

గండి చెరువు అలుగును తగ్గించండి

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని గండి చెరువు అలుగు పెంచడంతో అందులో నిండిన వ్యర్థాల దుర్వాసనలతో సతమతమవుతున్నామని ఖాజీపల్లి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో సమస్య మరింత తీవ్రమవుతుందని వాపోతున్నారు. దీంతో దుర్గమ్మబస్తీ కాలనీవాసులు భరించలేకపోతున్నామని చిన్నారులు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెంగీ, మలేరియా వంటి సమస్యలు ప్రభావం చూపుతున్నాయని ఆవేదన చెదుతున్నారు. అలుగును తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం డైరెక్టర్ రాజేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి నెలరోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో వసతి, భోజనం ఉచితమని తెలిపారు. సంగారెడ్డి, మెదక్ జిల్లా చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9704446956, 9490 12939 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

సీఐ వినాయక్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: నిరుపేదల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పటాన్‌చెరు సీఐ వినాయక్ రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని సీఐటీయూ శ్రామిక భవన్‌లో అమేధా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజీరా విజ్ఞానం కేంద్రం సోషల్ సర్వీస్‌లో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. ప్రతిదీ లాభాలతో చూడొద్దని, పేద ప్రజలకు సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో అమేధా ఆస్పత్రి వైద్యుడు రాజేంద్ర, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య, ఆస్పత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేయించుకుంటున్న సీఐ

యూరియా కొరతపై ఆందోళన వద్దు

శివ్వంపేట(నర్సాపూర్): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. మండలంలో 21 వేల ఎకరాల్లో వరి పంట సాగుచేస్తుండగా.. ఇప్పటి వరకు 23,500 బస్తాల యూరియా పంపిణీ చేశారన్నారు. మండలానికి నిత్యం యూరియా వచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిశామన్నారు. ప్రతిరోజు యూరియా అందుబాటులో ఉంటుందని, రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం వ్యవసాయ అధికారి లావణ్య మాట్లాడుతూ మోతాదుకు మించి యూరియా వాడటంతో పంటకు తెగుళ్లు వచ్చే అస్కారం ఉందన్నారు. శివ్వంపేట, గోమారం సొసైటీల ద్వారా యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మధు, జిల్లా రైతు రక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు మైసయ్యయాదవ్ ఉన్నారు.



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి

ఘనంగా మిలాద్ ఉన్ నబి

జిల్లా వ్యాప్తంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ముస్లిం ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలో ఆయా పార్టీలకు చెందిన ముస్లిం నాయకులు పాల్గొన్నారు. జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీలు తీశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కాశీపూర్‌లో మిలాద్ ఉన్ నబి వేడుకలు



జహీరాబాద్: రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు



జిన్నారం(పటాన్‌చెరు): వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న సీఐ రవీందర్‌రెడ్డి



రామచంద్రాపురం: మిలాద్ ఉన్ నబి వేడుకల్లో పాల్గొన్న ఎస్‌ఐ రమేశ్